
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
సోమవారం, జూలై 20, 2026 పేజీలు : 6





## ప్రతి ఇంటికి వెళ్లి సర్ ఫారాలు పూర్తి చేయించాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



# కల్తీ కల్లు మాఫియాకు అడ్డుకట్ట ఎప్పుడు?



- సీహెచ్ తయారీ కేంద్రాలపై దాడులు...
- అసలు సూత్రధారులపై చర్యలే కీలకం.!

**మహబూబ్‌నగర్, జూలై 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
సామాన్య ప్రజలు తాగే కల్తీ కల్లు తయారీ, విక్రయాల వెనుక నడుస్తున్న మాఫియా వ్యవస్థ మరోసారి బట్టబయలైంది. హైదరాబాద్ ఎక్సైజ్ ఈగల్ బృందం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన నిషేధిత "సీహెచ్" తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి భారీ స్థాయిలో యంత్రాలు, ముడిసరుకు, తయారైన పదార్థాన్ని స్వాధీనం చేసుకుంది.ప్రాథమిక సమాచారం ప్రకారం అడ్డాకుల మండలానికి చెందిన వ్యక్తి యంత్రాలతో సీహెచ్ తయారు చేసి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇతర జిల్లాల్లో పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమాచారం



# గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లవద్దు

-నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్.వినీత్
-మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి



నారాయణపేట ప్రతినిధి జూలై 19 (ప్రజా జ్యోతి)
ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగాచేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు

## పాలమూరు ప్రాజెక్టులపై రాజకీయాలకు అతీతంగా
# పోరాటం చేయాలి

మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్



# కల్తీ కల్లు మాఫియాకు అడ్డుకట్ట ఎప్పుడు.?

ఆధారంగా ఈగల్ బృందం ఆది వారం తెల్లవారుజామున ఆకస్మికంగా దాడులు నిర్వహించింది. ప్రస్తుతం12 మంది నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగుతోంది.


చిన్న వారిపై కేసులు... పెద్దలపై ఎందుకు మౌనం.?

ఈ దాడితో మరోసారి కీలక ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. కల్తీ కల్లు తయారీలో ఉపయోగించే సీహెచ్ తయారీ కేంద్రాలు యంత్రాలతో, పెద్ద ఎత్తున నిర్వహించబడుతున్నా, అవి చాలా కాలంగా అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా.? రాష్ట్రవ్యాప్తంగా సరఫరా జరిగేంత పెద్ద నెట్‌వర్క్ ఉన్నా స్థానిక స్థాయిలో ఎలాంటి సమాచారం లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

మామూళ్ల ఆరోపణలు... విచారణ అవసరం

కల్లు వ్యాపారంలో అక్రమాలు, కల్తీ పదార్థాల వినియోగంపై ఎక్సైజ్ శాఖలో కొంతమంది సిబ్బంది మామూళ్లకు అలవాటు పడి కళ్లుమూస్తున్నారనే ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమా? కాదా? అనేది సమగ్ర దర్యాప్తుతోనే తేలాల్సి ఉంది. నిజంగా ఎవరైనా అధికారుల నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం ఉంటే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం:
నిషేధిత రసాయనాలతో తయారయ్యే కల్తీ కల్లు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదకరం. ఇలాంటి పదార్థాల వినియోగం వల్ల అనారోగ్య సమస్యలు, ప్రాణాపాయ పరిస్థితులు కూడా తలెత్తే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు




హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ లాభాల కోసం కొందరు అక్రమ వ్యాపారులు ఈ దందాను కొనసాగించడం ఆందోళన కలిగిస్తోంది.

అసలు సూత్రధారుల వరకు చేరుతారా.?

ప్రస్తుతం ఎక్సైజ్ ఈగల్ బృందం, నార్కోటిక్ హైదరాబాద్ బృందం సీహెచ్ తయారీ కేంద్రాన్ని గుర్తించి దాడులు నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమే. అయితే కేవలం తయారీదారులు, కూలీల వద్దే విచారణ ఆగిపోకుండా, ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న నిర్వాహకులు, పెట్టుబడిదారులు, సరఫరాదారులు, కొనుగోలుదారులు, అలాగే ఎవరి సహకారంతో ఈ వ్యవస్థ నడుస్తుంది, నడిచిందన్న కోణంలోనూ దర్యాప్తు జరిగితేనే కల్తీ కల్లు మాఫియాకు శాశ్వత అడ్డుకట్ట పడుతుంది

## ప్రతి ఇంటికి వెళ్లి సర్ ఫారాలు పూర్తి చేయించాలి

మహబూబ్‌నగర్, జూలై 19
నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సర్ ప్రక్రియపై ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నగర కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కార్పొరేటర్ తమ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి సర్ ఫారాలు నింపించడంలో ప్రజలకు సహకరించాలని సూచించారు. ఓటర్లలో అవగాహన కల్పించడం అత్యంత ముఖ్యమని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒక్క ఓటరు కూడా ఓటు కోల్పోకుండా ప్రతి ఇంటిని సందర్శించి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.
సమావేశంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వహక అధ్యక్షుడు అజ్మత్ అలీ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు

## పౌల్ట్రీ ఫారంలో డ్రగ్స్ ఫ్యాక్టరీ..

### -రూ.20.30 లక్షల ఆల్ప్రాజోలామ్ స్వాధీనం..

భూత్పూర్ జూలై 19
మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామ శివారులోని లక్ష్మీ నరసింహ పౌల్ట్రీ ఫారంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఆల్ప్రాజోలామ్ డ్రగ్స్ తయారీ కేంద్రంపై ఆదివారం తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు.విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన దాడిలో అక్రమ తయారీ యూనిట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి, ప్రధాన నిందితుడికి ఆశ్రయం కల్పించిన వారితో సహా నలుగురిని అరెస్టు చేశారు. దాడిలో సుమారు 1.150 కిలోల ఆల్ప్రాజోలామ్ తో పాటు తయారీకి ఉపయోగించేరసాయనాలు,యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు రూ.20.30 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.ప్రధాన నిందితుడు గతంలో ఇదే తరహా కేసులో అరెస్టై జైలు శిక్ష అనుభవించి,బెయిల్‌పై విడుదలైన తర్వాత మళ్లీ భూత్పూర్‌లో కొత్తగా డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు విచారణలో వెల్లడైంది.ఇక్కడ తయారైన ఆల్ప్రాజోలామ్‌ను గుట్కా, తంబాకూ ఉత్పత్తుల్లో కలిపి స్థానిక డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు ఈగల్ ఫోర్స్ అధికారులు గుర్తించారు.
ఈ కేసులో మూసాపేట గ్రామానికి చెందిన మలెల జయప్రకాశ్ గౌడ్ (39), తిరుమలాపూర్ గ్రామం వికారాబాద్ జిల్లాకు చెందిన చేదురుపల్లి కృష్ణయ్య (50), తుంకినిపూర్ కు చెందిన
గడ్డగిడి బాలాంజానేయులు (51) , భూమి యజమాని బోయ నరసింహులు (58) న్యూ గంజ్, మహబూబ్ నగర్ లను అరెస్టు చేశారు.
ఈ ఘటనపై హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, డ్రగ్స్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ఇతర సభ్యులు,ఆర్థిక లావాదేవీలు,రసాయనాల సరఫరా మార్గాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలుస్తోంది.మీ ప్రాంతాల్లో మత్తు పదార్థాల కార్యకలాపాల సమాచారాన్ని ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఈగల్ ఫోర్స్ అధికారులు కోరారు.

### గొలుసుకట్టు వ్యాపారాల

## జోలికి వెళ్లవద్దు

కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు.
మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్. ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు.
గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి, మీ క్రింద ఎక్కువ మంది ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్దికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు.సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు.
సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు.
అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

## పాలమూరు ప్రాజెక్టులపై రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలి

మహబూబ్‌నగర్, జూలై 19 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పోరాటం చేయాలని మాజీ మంత్రి విరసనోల్ల. శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూ టౌన్ క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు చెరువులను నింపడం ద్వారా సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచామని తెలిపారు. గతంలో జిల్లాలో కేవలం రెండు లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగేదని, తమ ప్రభుత్వ హయాంలో అది దాదాపు పది లక్షల ఎకరాలకు పెరిగిందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా మహబూబ్‌నగర్‌లో గతంలో 14 రోజులకు ఒకసారి వచ్చే తాగునీటిని ప్రతిరోజూ అందించేలా చర్యలు తీసుకున్నామని, కృష్ణా జలాలను ఇంటింటికీ అందించడంతో పాటు తండాలు, గ్రామాలు, పట్టణాలకు తాగునీటి సౌకర్యం కల్పించామని చెప్పారు.
పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయితే రైతులకు అపార ప్రయోజనం కలుగుతుందని, వరదల సమయంలో వచ్చే నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన సామర్థ్యంతో ప్రాజెక్టును రూపకల్పన చేశామని తెలిపారు. ప్రాజెక్టులో మిగిలిన పనులు పూర్తి చేస్తే సుమారు 12.32 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు. టెండర్లు రద్దు చేయడం వల్ల పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుత బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం 11 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6--7 టీఎంసీల నీరు కూడా నిల్వ ఉండటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తెలంగాణకు సాగునీరు దక్కకుండా చేసే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌డీఎస్ పరిధిలో అక్రమంగా చేపడుతున్న పనులను అరికట్టాలని, ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు అంశంపై న్యాయపరంగా ముందుకు వెళ్లాలని సూచించారు.



సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను ఫొటోలతో సహా వివరించి, జిల్లా ప్రయోజనాల కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.

# రూ.50 వేల సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగించిన నిజాయితీ గల ఆటో డ్రైవర్‌కు జిల్లా ఎస్పీ ప్రశంసలు

**మహబూబ్‌నగర్, జూలై 19 (ప్రజా జ్యోతి బ్యూరో ):**
సుమారు రూ.50 వేల విలువైన సెల్‌ఫోన్‌ను ఎలాంటి ఆశ లేకుండా పోలీసుల ద్వారా అసలు యజమానికి అప్పగించిన ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్ నిజాయితీని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి అభినందించారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి వెంకట్ రాజు తెలంగాణ చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్‌కు ఆటోలో ప్రయాణించారు. ఈ క్రమంలో ఆయన ప్యాంటు జేబులో ఉన్న సెల్‌ఫోన్ జారి ఆటో వెనుక సీటు పక్కనున్న సందులో పడిపోయింది. రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత ఫోన్ కనిపించకపోవడంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు ప్రయాణికుడిని దించిన అనంతరం మరో పనికి వెళ్లిన ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్, పని పూర్తయ్యాక ఆటోను శుభ్రం చేస్తుండగా సీటు పక్కన సెల్‌ఫోన్ కనిపించింది. అది ప్రయాణికుడిదేనని గుర్తించిన ఆయన వెంటనే సెల్‌ఫోన్‌ను తీసుకుని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఇన్‌స్పెక్టర్ కు అప్పగించారు. ఇదే సమయంలో ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తుండగా, అబ్దుల్ హఫీజ్ స్వచ్ఛందంగా స్టేషన్‌కు చేరుకుని సెల్‌ఫోన్ అందజేశారు. అనంతరం పోలీసులు సెల్‌ఫోన్‌ను యజమాని వెంకట్ రాజుకు అప్పగించారు. ఈ



సందర్భంగా ఆటో డ్రైవర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ ఘటనపై స్పందించిన జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ, ఇతరుల ఆస్తి లభించినప్పుడు దానిని యజమానికి లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ అబ్దుల్ హఫీజ్ ప్రదర్శించిన నిజాయితీ, బాధ్యతాయుతమైన వైఖరి సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు.

# విశ్వశాంతి లోక కళ్యాణం ప్రజల ఆరోగ్యాల కోసమే మహాయాగం

## స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆశీస్సులతో ఆయుత చండీ మహాయాగం ప్రారంభం







**కల్వకుర్తి, జూలై 19 (ప్రజా జ్యోతి )**
విశ్వశాంతి లోక కళ్యాణం ప్రజల ఆరోగ్యాల కోసమే మహాయాగం స్వామీజీ నిర్వహిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారంకల్వకుర్తి లోని బి.ఎస్.ఎన్.ఎల్ గ్రౌండ్‌లో శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో 16 రోజుల పాటు నిర్వహించే ఆయుత చండీ 91 విశ్వశాంతి మహాయాగ మహోత్సవం ఈ రోజు ఘనంగా ప్రారంభమై, ఆగస్టు 3 వరకు 16 రోజుల క్రితంపాటుకొనసాగనుండగా, ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామీజీ విశ్వశాంతి, లోకకల్యాణం, ప్రజల ఆయురారోగ్యాల కోసమే మహాయాగం నిర్వహిస్తున్నట్లు పేర్కొనగా, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇవ్వగా, స్వామీజీ ఆయనను ఆశీర్వదించి ప్రజాసేవలో మరింత విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు.యాగానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు,యాగానికి వచ్చే భక్తులకు ప్రతి రోజు మూడు పూటల వచ్చే భోజన వసతి ఏర్పాటు చేసినట్టు స్వామీజీ తెలిపారు.ఈ యాగం లో 500 మంది ఋత్వికులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్ జూలూరి రమేష్ బాబు,నాయకులు సురేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, మండల అధ్యక్షులు బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమకాంత్ రెడ్డి, సతీష్, రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణ, కౌన్సిలర్ లు, నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులపై నేడు ఉమ్మడి పాలమూరులో ఉన్నతస్థాయి సమీక్ష

మహబూబ్‌నగర్, జూలై 20 (ప్రజా జ్యోతి బ్యూరో ): ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన కీలక సమీక్ష సమావేశం జరగనుంది. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. సమావేశంలో తక్కువ వర్షపాతం అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి నిర్వహణ, వ్యవసాయం, సాగునీరు, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్య, విద్యుత్ సరఫరా, విపత్తు నిర్వహణ తదితర శాఖలు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా చర్చించనున్నారు. అధికార యంత్రాంగం అనుసరించాల్సిన కార్యాచరణపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశం నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

# ఆర్టీసీ ని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- సంపూర్ణ ఉద్యోగ భద్రత కోసం
- ఆర్టీసీ ఎస్ డబ్ల్యు ఎఫ్ ను బలపరచండి
- ఎస్ డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు



**నాగర్ కర్నూల్ జూలై 19 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి )**
ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ సమస్యలు లేకుండా జరగాలని,ఆర్టీసీ ఉద్యోగుల సమావేశం అచంపేట్ ఆర్టీసీ డిపో గేటు ముందు ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు హాజరై, ప్రసంగిస్తూ ఆర్టీసీలో విలీనం ప్రక్రియ త్వరగా జరగాలని ఆర్టీసీ కార్మికులందరూ...కోరుకుంటున్నారని అయితే విలీనం ఎలా ఉండాలి విలీనం కంటే ముందు ఉన్న సమస్యలు ఎలా పరిష్కరించబడాలి అనే విషయంలో విలీన కమిటీ వేసి అధ్యయనం చేసి కార్మికులకు,యాజమాన్యానికి తెలియచెప్పిన సంఘం ఆర్టీసీలో ఎస్ డబ్ల్యు ఎఫ్.ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటం మూలంగా 11శాతం వేతన సవరణ..జరిగిందన్నారు.జరగబోయే విలీనం ప్రక్రియలో కార్మిక సంఘాల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఆర్టీసీ కార్మిక వర్గానికి లాభం జరగాలంటే,సంపూర్ణ ఉద్యోగ భద్రత..కల్పించబడాలంటే, పని భారం తగ్గాలంటే ,వేధింపులు లేని ఆత్మగౌరవంతో ఉద్యోగం చేసుకునే పరిస్థితులుకల్పించబడాలన్నారు.ఈ సమీక్ష సమావేశంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్ రీజనల్ కార్యదర్శి ఎస్ వెంకటయ్య అధ్యక్షులు కృష్ణ డిపో అధ్యక్ష కార్యదర్శులు చెన్న కేశవులు., రీజనల్ నాయకులు గోపాల్ ,డిపో నాయకులు విజయ్, ఆంజనేయులు, దానియెల్ శ్రీను, సీఐటీయూ మండల కార్యదర్శి రాములు కార్మికులు తదితరులు పాల్గొన్నారు

# రామాలయంలో వారాహి దేవి నవరాత్రి పూజలు

**నాగర్ కర్నూల్ : జూలై 19 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల సీతారామచంద్రస్వామి దేవాలయంలోఆదివారం వైభవంగా వారాహి దేవి నవరాత్రి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించినట్లుఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు,మహిళల వచ్చి వారాహి దేవి మాత ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా వేద మంత్ర చరణలతో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సామూహికంగా అష్టోత్తరముతో కుంకుమార్చన, అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అనంతరం పాల్గొన్న భక్తులందరికీ వేద ఆశీర్వచనం,కుంకుమ,ప్రత్యేక ప్రసాదాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.గురువారం వరకు వారాహి దేవి ప్రత్యేక పూజలు రాత్రి 7 గంటల నుండి 9 వరకు నిర్వహిస్తామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అర్చకులు కందాడై శ్రీనివాస ఆచార్యులు,కరుణ శ్రీ,భక్తులు పాల్గొన్నారు.



# నారాయణపేటలో నిరసన ర్యాలీ

## ప్రవేశ పరీక్షల్లో అవకతవకలకు దేశవ్యాప్తంగా వ్యతిరేకత



**నారాయణపేట ప్రతినిధి జూలై 19 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఒక సంబంధిత నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. పార్టీ రాష్ట్ర అధినేత శ్రీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమం దేశంలో నీట్ ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు జరిగిన విషయాన్ని వ్యతిరేకించడానికి, ఎన్ టి ఎపరీక్షను రద్దు చేయాలని మరియు దీనికి కారణమైన కేంద్ర విద్యా మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసేందుకు నిర్వహించబడింది.పార్క్ లేదా చౌరస్తాల నుంచి ప్రారంభమైన సంఘీభావ ర్యాలీ నర్సిరెడ్డి చౌరస్తా నుండి వీరసావర్కర్ చౌరస్తా వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు, స్థానిక విద్యార్థులు కలిసి పాల్గొన్నారు. ర్యాలీ పార్టీ స్థానిక నేతలు రాష్ట్ర కార్యదర్శి మీదింటి శివవీర్, జిల్లా అధ్యక్షుడు మడివాల కృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు గౌడ్, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కొమ్మూరు రమేష్, యువజన విభాగ అధ్యక్షుడు కే.రఘు విద్యార్థుల సహకారంతో ముందునుంచి నడుచుకున్నారు.పౌర నేతలు మరియు విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పరీక్షల నిర్వహణలో పారదర్శకతను కలిగి ఉండేలా చర్యలు చేపట్టకపోవడాన్ని ఖండిస్తూ, నీట్ పరీక్షను రద్దు చేయాలని, మరియు విద్యా వ్యవస్థాన్ని మెరుగుపరచడానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వారు ప్రత్యేకంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యతను తెలికపరిచే సూచనలు చేసినట్టుగా, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ ప్రకటించారు.ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కూడా ఇలాంటి ఆందోళన చర్యలు ప్రజాప్రతినిధులచే చేపట్టబడ్డాయని, అక్కడ జరిగిన ఆమరణ నిరాహార దీక్షను కేంద్ర ప్రభుత్వం దుబారగా భగ్నం చేయడంతో బాధ్యతాపూర్వక చర్యల కోసం స్థానిక స్థాయిలో కూడ నిరసనలు కొనసాగుతున్నాయని పార్టీ నేతలు చెప్పారు.స్థానిక పోలీసులు ఆందోళన ర్యాలీ శాంతిగా పూర్తవడానికి పర్యవేక్షణ నిర్వహించగా, అసాధారణ సంఘర్షణలేమీ జరగలేదని వివరించారు. నేతలు భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలనూ, పిలుపులనూ తప్పకుండా కొనసాగిస్తామని చెప్పారు.

# బీఆర్ఎస్ బలోపేతంలో యువతే కీలకం

## : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి




**మహబూబ్‌నగర్, జూలై 19 (ప్రజా జ్యోతి బ్యూరో ):**
బీఆర్ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడంలో యువత కీలక పాత్ర పోషించాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలో దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆల ప్రీతి రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువత ముందుండాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని కోరారు.పార్టీ సంస్థాగత నిర్మాణంలో యువతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తామని, కొత్త కమిటీల్లో వారికి కీలక బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు, అవకాశాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువజన డిక్లరేషన్, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించిన ఆయన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలని యువతకు సూచించారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసి, కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని యువ నాయకులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## అకాల వర్షాలతో ఏర్పడిన రోడ్డు గుంతలకు అర్ధరాత్రే మరమ్మతులు

**గండీడ్, జూలై 19 (ప్రజాజ్యోతి):**
గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలోని చాంద్ పాషా షాప్ సమీపంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత్ చెన్నయ్య సమయాన్ని లెక్కచేయకుండా అర్ధరాత్రి వేళలోనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం ఎలాంటి ఆలస్యం చేయకుండా సంబంధిత సిబ్బందితో రోడ్డుపై మొరం వేయించి గుంతలను పూడ్చించి మరమ్మతు పనులు చేపట్టించారు. దీంతో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించే పరిస్థితి ఏర్పడింది.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే స్పందించి చర్యలు చేపట్టడం సర్పంచ్ ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే సర్పంచ్ గుర్రాల నవనీత్ చెన్నయ్యకు గ్రామ ప్రజలు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు.



## ప్రేమ పేరుతో విద్యార్థినిని వేధించిన యువకుడు అరెస్ట్



**నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జూలై 19:**
నారాయణపేట జిల్లా మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దిరిపాడు కేజీబీవీ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిని ప్రేమించాలంటూ వేధించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం బొమ్మనపాడు గ్రామానికి చెందిన సాయి కార్తీక్ (20) అనే యువకుడు కళాశాలలో చదువుతున్న విద్యార్థినిని ప్రేమ పేరుతో పలుమార్లు వేధించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని ఆదివారం రోజు అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారు.ఈ విషయాన్ని మద్దూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బిజ్జ శ్రీనివాసులు తెలిపారు. మహిళలు, బాలికలను వేధించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

## అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

### -ప్రిన్సిపల్ మదన్ మోహన్



**నాగర్ కర్నూల్ : 19 జూలై (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ పట్టణంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల (గెస్ట్ ఫ్యాకల్టీ)నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మదన్ మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.తెలుగు,కెమిస్ట్రీ,జువాలజీ, డెయిరీ సైన్స్,కంప్యూటర్ సైన్స్ విభాగాలలోబోధించేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణులై కనీసం 55 శాతం మార్కులు (రాజ/రా లకు 50 శాతం) సాధించిన వారు అర్హులని నెట్,సెట్,పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని ఆసక్తి గల అభ్యర్థులు జూలై 21(మంగళవారం) న మధ్యాహ్నం 12 గంటలలోపు నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని అదేరోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ మదన్ మోహన్ తెలిపారు.

## చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి




**నాగర్ కర్నూల్ : 19 జూలై (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెర్వులో చేపలు పట్టేందుకు వెళ్లి వల చుట్టుకొని నీటిలో చిక్కుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది.ఆదివారం జరిగిన ఈ ఘటనతో మృతుడి కుటుంబంతో పాటు స్థానికుల్లో విషాదం అమలుకుంది మృతుడిని పూలమోని కృష్ణ గా గుర్తించారు,మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# వృద్ధులను లక్ష్యంగా చేసుకుని బ్యాంకుల వద్ద మోసాలకు పాల్పడుతున్న నేరస్థుల అరెస్ట్

**సీఐ శివశంకర్**

**నారాయణపేట ప్రతినిధి జూలై 19 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధితో పాటు నారాయణపేట టౌన్, ధన్వాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో బ్యాంకుల వద్ద వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి నగదు అపహరిస్తున్న ఇద్దరు నిందితులను నారాయణపేట రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించడం జరిగిందని నారాయణపేట సీఐ శివశంకర్ తెలిపారు

అరెస్టు చేసిన నిందితులు

1. చీరాల ఈశ్వరయ్య అలియాస్ శివ అలియాస్ మీసమోడా (43)
2. చీరాల రాధ అలియాస్ లక్ష్మీ (43)

ఇద్దరూ ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో నివాసముంటున్నారు.


నేరాల తీరు (వీశీసబం రాజూవతీఖఅఎఐ)

నిందితులు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బ్యాంకుల వద్దకు వచ్చే వృద్ధులను లక్ష్యంగా చేసుకునేవారు. బాధితులతో పరిచయం ఉన్నట్లుగా నటిస్తూ, "మీ కుమారుడు లేదా కుమార్తె మాకు తెలుసు" అంటూ నమ్మకం కల్పించి, వారి వద్ద ఉన్న నగదును తీసుకుని, మరో పని చెప్పి పంపించేవారు. బాధితులు తిరిగి వచ్చేలోపు అక్కడి నుంచి పరారయ్యేవారు. దొంగిలించిన డబ్బును ఖర్చు చేసిన తర్వాత మళ్లీ ఇదే తరహాలో ఇతర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడేవారు.

నిందితుడు చీరాల ఈశ్వరయ్యపై గతంలో 15 క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, వనపర్తి జిల్లాలో రెండు సార్లు పీడీ యాక్ట్ (గ్రాణ చామ్) కింద జైలుకు వెళ్లిన చరిత్ర ఉంది.

అరెస్టు వివరాలు

నారాయణపేట రూరల్ ఎస్ఐ ఎస్. సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందం 19.07.2026 ఉదయం చిన్న జట్రం చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, షైన్-125 మోటార్ సైకిల్‌పై వస్తున్న నిందితుడు పోలీసులను చూసి వాహనం వదిలి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకుని విచారించగా, నారాయణపేట టౌన్, నారాయణపేట రూరల్, ధన్వాడ ప్రాంతాల్లో చేసిన దొంగతనాలను అంగీకరించాడు. దొంగతనాలకు ఉపయోగించిన మాస్క్, బ్లేడ్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న ఆస్తి

నగదు -- రూ.35,800
షైన్-125 మోటార్ సైకిల్ -1
శాంసంగ్ స్మార్ట్ మొబైల్ -- 1
రిఫ్రిజిరేటర్ -- 1
స్మార్ట్ టీవీ -- 1

నమోదైన కేసులు

నిందితుడిపై నారాయణపేట, ధన్వాడ, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మొత్తం 15 కేసులు నమోదై ఉన్నాయి. ఇందులో ధన్వాడ పోలీస్ స్టేషన్‌లోని ఐఈ.సీ.70/2026, ఐఈ.సీ.100/2026, నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లోని ఐఈ.సీ.215/2026 కేసులు కూడా ఉన్నాయి.

ప్రజలకు సూచనలు

బ్యాంకుల వద్ద నగదు లావాదేవీలు చేసే సమయంలో అపరిచితులను నమ్మవద్దని, ఎవరికీ నగదు అప్పగించవద్దని, ముఖ్యంగా వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. వ్యాపార సంస్థలు, బ్యాంకుల పరిసరాల్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం ఇవ్వాలని నారాయణపేట సీఐ శివశంకర్ విజ్ఞప్తి చేశారు.

అభినందనలు

కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్న ఎస్ఐ ఎస్. సతీష్ కుమార్ రెడ్డి, కానిస్టేబుళ్లు లింగమూర్తి, సురేష్ మరియు ఐటీ సెల్ సిబ్బందిని తగిన రివార్డులకు సిఫారసు చేస్తామని సీఐ శివశంకర్ తెలిపారు.

## సింగారం వాటర్ పంప్ హౌస్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**నారాయణపేట ప్రతినిధి జూలై 19 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కొండ స్వేత సత్య యాదవ్ గారు ఈరోజు ఉదయం 7 గంటలకు సింగారం సమీపంలోని వాటర్ పంప్ హౌస్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ పంప్ హౌస్‌లోని నీటి సరఫరా, పంపింగ్ వ్యవస్థను స్వయంగా పంప్ హౌస్ పైకి వెళ్లి పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నారాయణపేట పట్టణ ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వాటర్ పంప్ హౌస్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రస్తుతం నారాయణపేట పట్టణానికి రోజుకు సుమారు 6.6 మీణ నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, నీటి విలువను గుర్తించి మున్సిపాలిటీకి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కొండ స్వేత సత్య యాదవ్ గారు కోరారు.

## ఉమ్మడి పాలమూరు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలి

**వడ్డేపల్లి జూలై 19(ప్రజా జ్యోతి):**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ,అలంపూర్ నియోజకవర్గం చైర్మన్ రామ్మోహన్ డిమాండ్ చేశారు.ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విస్తృత స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి అలంపూర్ ప్రాంతం నుంచి జేఏసీ నాయకులు బయలుదేరారు.ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఉమ్మడి జిల్లాలోని పలు కీలక సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పూర్తి కాక రైతులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయించేందుకు ప్రజాపోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు,ఉద్యమకారులు,రైతు సంఘాల నాయకులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు.సమావేశానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు గార్లపాడు భూషణం,సర్పంచుల సంఘం జిల్లా నాయకుడు,తిమ్మాజిపల్లె సర్పంచ్ నాగేష్ యాదవ్,నాయకులు హనుమంతు,ఉద్యమకారుల జిల్లా కార్యదర్శి చెన్నిపాడు దుబ్బన్న,రఘు,లక్ష్మన్న, శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలను ఏకం చేసి పెండింగ్ ప్రాజెక్టుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



## 5వ జాతీయ జావెలిన్ దినోత్సవం

**కల్వకుర్తి జూలై 19 (ప్రజా జ్యోతి):**

వచ్చే నెల 7వ తేదీన హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించనున్న 5వ జాతీయ జావెలిన్ దినోత్సవ వేడుకలు 1వ తెలంగాణ రాష్ట్ర కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ (అండర్-6, 8, 10, 12 కిడ్స్ ఈవెంట్స్), అలాగే అండర్-14, 16, 18, 20 బాలురు, బాలికలు పురుషులు, మహిళల రాష్ట్ర అథ్లెటిక్స్ మీట్ కోసం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఈరోజు కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు ఈ ఎంపికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎంపికలను తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్ ఠాకూర్ కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి ఆనంద్ కుమార్ సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా బాలాజీ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జాతీయ జావెలిన్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీరజ్ చోప్రా సాధించిన విజయాలు దేశ యువతలో జావెలిన్ త్రో పట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా అథ్లెటిక్స్ క్రీడల అభివృద్ధికి విశేష ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు రాష్ట్రంలోని యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అథ్లెట్లను తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు.

కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్ అథ్లెట్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి ఎంపికల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు తన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు మరియు బహుమతులను అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ చిత్తరి శ్రీనివాసులు, జీడిపల్లి సర్పంచ్ అంజి, నాయకులు సంతు యాదవ్, జమ్ముల శ్రీకాంత్, శివ, భాస్కర్, దున్న భాస్కర్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

